కాకినాడ **ఉష్ణోగ్రతలు**

గరిష్ఠం : 35 (శనివారం)

కనిష్ఠం : 28

జేఎన్టీయూకేలో పాకిస్థాన్ జెండా తొలగింపు

తగులబెట్టిన హిందూ సంఘాల నాయకులు

మెయిన్‌లో..



అన్నవరంలో పండిత సదస్యం సందర్భంగా ప్రత్యేక అలంకరణతో ఆశీనులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారు

ఘనంగా పండిత సదస్యం

- సుమారు 192 మంది పండితులకు సత్కారం
- వేదఘోషతో పులకించిన సత్యదేవుడి సన్నిధి
- నేడు సత్యదేవుడి రథోత్సవం 7

బాధ్యతల బరువు!



- తూనికలు, కొలతల శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సగానికిపైగా పోస్టులు ఖాళీ
- నలుగురు ఉండాల్సినచోట ఒక్కరే విధులు
- పని ఒత్తిడితో సతమతమవుతున్న ఇన్‌స్పెక్టర్లు
- తూతూమంత్రంగా తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

ఓవైపు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు తూకాల్లో మోసాలు వినియోగదారులను నష్టపరుస్తున్నాయి. నిత్యం దాడులు నిర్వహించి ఈ తరహా మోసాలను అరికట్టాల్సిన తూనికలు, కొలతల శాఖ అధికారులు మాత్రం చోద్యం చూడాల్సిన పరిస్థితి. దీనికి ప్రధాన కారణం ఆ శాఖలో సిబ్బంది కొరత.. అవును.. ఆ శాఖను ఈ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నలుగురు సిబ్బంది ఉండాల్సిన చోట కేవలం ఒక్కరంటే ఒక్కరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఎంతో కీలకమైన ఈ శాఖలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్యాజువల్ సిబ్బంది 33 మందికి 16 మందే ఉన్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కూరగాయల మార్కెట్ మొదలు రైసుమిల్లులు, పెట్రోల్ బంకులు, వస్త్ర, కిరాణా, ఆయిల్, చికెన్, మటన్ దుకాణాలు, సినిమా హాళ్లు, వాణిజ్య సముదాయాలు, బస్టాండ్లలో దుకాణాలు, బండ్లు, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్స్. ఇలా తూకాలు, కొలతలు వేసే ప్రతి దుకాణం తూనికలు, కొలతలశాఖ పరిధిలోకి వస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటుగా ఎలాంటి వస్తువులనైనా ప్యాకింగ్ చేసి నిబంధనలు అతిక్రమించినా, నిర్ణీత ధరలకంటే అధికంగా విక్రయించినా చర్యలు తీసుకోవచ్చు. వీటన్నింటినీ ఆ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో చేయలేకపోతున్నారు. తీవ్ర పని ఒత్తిడితో సిబ్బంది సతమతమవుతున్నారు. బంగారు దుకాణాలు, గ్యాస్ ఏజెన్సీలు, వేబ్రిడ్జిలు, కూరగాయల మార్కెట్లు తదితరాల్లో ఎమ్మార్పీలు, డేటా ఆఫ్ ప్యాకింగ్.. ఇలాంటి వాటిపై దాడులు జరిపి మోసాలు అరికట్టాల్సి ఉన్నా.. ఆ దిశగా సమర్థంగా పనిచేయలేకపోతున్నారు. ఏడాదికోసారి ఆయా దుకాణాల్లో వినియోగించే కాటాలను తనిఖీ చేయాలి. ఇవన్నీ చేయడం ఉన్న సిబ్బందికి కష్టంగా మారింది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తనిఖీ ఇన్‌స్పెక్టర్లు బహుపాత్రలు పోషించాల్సి వస్తోంది.

పని భారం పెరిగి..

కాకినాడ జిల్లాలో ప్రస్తుతం ఒక అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫీసర్, కాకినాడ, పెద్దాపురం డివిజన్లకు ఒక్కొక్కరు చొప్పున తనిఖీ ఇన్‌స్పెక్టర్లు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోను ఒక అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫీసర్, అమలాపురం, రామచంద్రపురంల్లో ఇద్దరు తనిఖీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఒక ఏసీ, సర్కిల్-1,2ల్లో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. 8 నుంచి పది మండలాలకు ఒక ఇన్‌స్పెక్టర్ ఉంటారు. ఒక్కో మండలంలో 20కి పైగా గ్రామాలు ఉంటాయి. ఒక గ్రామంలో చిన్న, పెద్ద.. ఏవైతేనేం కనీసం 20 నుంచి 40 వరకు దుకాణాలు ఉంటాయి. వీటిలో దాదాపు అన్నిచోట్లా సరుకును తూకం వేయాల్సిందే. ఈ సమయంలో వీటన్నింటినీ ఒక ఇన్‌స్పెక్టర్ మాత్రమే తనిఖీ చేయాల్సి రావడం తలకు మించిన భారమవుతోంది. దానికితోడు ఈ మండలాలు అన్నిటికీ ఒక్కరే తన సొంత వాహనంపై వెళ్లి తిరిగి రావాలి. ఒకవేళ ఎక్కడైనా తూకాల్లో తేడా వచ్చి సరుకును సీజ్ చేస్తే.. దాన్ని వెంట పెట్టుకుని ఆఫీసుకు తీసుకురావాలి. ప్రస్తుతం ఈ బాధ్యతంతా ఒక్క ఇన్‌స్పెక్టర్‌పైనే పడుతోంది. జిల్లాలో క్యాజువల్ సిబ్బంది 33 మంది ఉండాల్సి ఉండగా 16 మందే ఉన్నారు. 2007 నుంచి ఇన్‌స్పెక్టర్ల రిక్రూట్‌మెంట్ లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక టెక్నికల్ అసిస్టెంట్లు రెండు ఖాళీలు ఉన్నాయి. అటెండర్ల పోస్టులు ఆరు ఖాళీగా ఉన్నాయి.

ఒక్కరంటే ఒక్కరే..

కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం ఆఫీసులో ఇన్‌స్పెక్టర్ ఒక్కరే ఉన్నారు. ఉదయం ఆఫీసు తాళం తీయడం, పనిచేసుకోవడం, సాయంత్రం తిరిగి తాళం వేసుకోవడం అన్నీ ఆయనే చేసుకోవాల్సిన పరిస్థితి. ఇక అమలాపురం ఆఫీసులో ఇన్‌స్పెక్టర్‌ది కూడా అదే పరిస్థితి. అదనంగా కొవ్వూరు బాధ్యతల భారం కూడా ఆయనదే.. కొవ్వూరులో ఉంటే అమలాపురంలో కనిపించరు.. అమలాపురంలో ఉంటే కొవ్వూరులో ఉండరన్నమాట. ఇక కాకినాడ జిల్లా పెద్దాపురం, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోనూ అదే పరిస్థితి. ఒక్కరే ఇన్‌స్పెక్టర్. అక్కడ అన్ని వ్యవహారాలూ వారే చక్కబెట్టుకోవాలి. ఒకప్పుడు ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్, అటెండర్, చౌకీదారు.. ఇలా ఒక బృందం పనిచేసేది. ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్ ఒక్కరే అన్ని విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఎక్కడికక్కడ సిబ్బంది రిటైర్ అయినా ఈ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయని పరిస్థితి. కనీసం ఇతర విభాగాల నుంచి సిబ్బందిని కూడా ఈ శాఖకు అనుసంధానం చేయలేదు. ప్రస్తుతం తూనికలు, కొలతలశాఖలో నగదు రూపంలో చెల్లింపులు నిలిపివేశారు. ఏదైనా సరే ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. వీటిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆ శాఖ సిబ్బందిదే. ఎంతో కీలకమైన ఈ శాఖలోకి కనీసం సచివాలయాల సిబ్బందినైనా డిప్యూటేషన్‌పై పంపితే ఆ శాఖ బలోపేతమయ్యే అవకాశం ఉంది. తూనికలు, కొలతల శాఖలో తక్షణం ఖాళీలను భర్తీ చేస్తేనే వినియోగదారులకు సరైన న్యాయం జరిగే అవకాశం ఉంది.

పైరవీకారులు!



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లకు పైరవీల జోరు
- అయిదేళ్ల తర్వాత పథకం మొదలవడంతో ఎలాగైనా దక్కించుకోవాలని పాట్లు
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల వద్దకు వెళ్లి యూనిట్ల కోసం కొందరు తెగ ప్రయత్నాలు
- పోటీ తీవ్రంగా ఉండడంతో ఉమ్మడి జిల్లాలో 2,732 యూనిట్లకు 13,317 దరఖాస్తులు రాక
- కాకినాడ జిల్లాలో 5,498, కోనసీమ 3,265, తూర్పుగోదావరిలో 4,555 మంది పోటీ
- రూ.10 లక్షల రుణం విభాగంలో ఇచ్చే కారు, గూడ్స్‌ట్రక్, ఆటోల కోసం అప్పుడే ఖర్చీఫ్‌లు
- నలభై శాతం సబ్సిడీ,బ్యాంకు రుణం 55శాతం వస్తుండడంతో తెగ తాపత్రయం
- ఇదే అదనుగా రుణం వచ్చేలా చేస్తామంటూ కొందరు చోటా నేతలు కమీషన్ల వసూలు
- రూ.4 లక్షలు సబ్సిడీగా వస్తుండడంతో రూ.లక్ష ఇవ్వాలంటూ దళారుల బేరాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇవ్వనున్న స్వయం ఉపాధి రుణ యూనిట్లకు అప్పుడే పైరవీలు మొదలయ్యాయి. ఎలాగైనా పథకం ద్వారా లబ్ధిపొందాలని కొందరు రాజకీయ ఒత్తిళ్లకు దిగుతున్నారు. ముఖ్యంగా ఈ పథకం కింద కార్లు, గూడ్స్ ట్రక్కులు, ఆటోలు సబ్సిడీ, రుణం ద్వారా ఇస్తుండడంతో తమకే ఈ యూనిట్ వచ్చేలా చేయాలంటూ కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో కొందరు తెగ పావులు కదుపుతున్నారు. రూ. పది లక్షల యూనిట్ విభాగంలో ఇచ్చే కార్లు, ట్రక్కులు, ఆటోలకు ప్రభుత్వం నుంచి నలభై శాతం సబ్సిడీ వస్తుండడం, మరో 55 శాతం బ్యాంకు నుంచి రుణం మంజూరుకానుండడంతో తమకే రుణం వచ్చేలా చూడాలంటూ వివిధ పార్టీల నేతలను ఆశ్రయిస్తున్నారు. ఖర్చు అయినా ఫర్వాలేదని పథకానికి ఎంపికచేయాలంటూ అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. అటు ఇదే అదనుగా కొందరు చోటా నేతలు దరఖాస్తుదారుల నుంచి ముందే కమీషన్లు పుచ్చుకుంటూ రుణ మంజూరుకు హామీలు కూడా ఇచ్చేస్తున్నారు. వాస్తవానికి వైసీపీ అయిదేళ్ల పాలనలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు పూర్తిగా మంగళం పాడేసింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో మళ్లీ ఇన్నేళ్ల తర్వాత రుణాలు ఇస్తుండడంతో పోటీ అధికంగా ఏర్పడింది. ఉమ్మడి జిల్లాకు మొత్తం 2,732 యూనిట్లు మంజూరుకాగా ఇప్పటివరకు 13,317 మంది దరఖాస్తు చేసుకున్నారు. శనివారం చివరి రోజు పూర్తికావడంతో మళ్లీ గడువు పొడిగిస్తారా లేదా అనేది స్పష్టం కావాల్సి ఉంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నిరుపేద ఎస్సీ సామాజిక వర్గంలో యువత, మహిళలకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వివిధ యూనిట్లను మంజూరు చేసింది. అర్హులైన వారికి వీటిని సబ్సిడీ, రుణం ద్వారా ఇవ్వడానికి దరఖాస్తులను ఆహ్వానించింది. మొత్తం 32 రకాల స్వయంఉపాధి యూనిట్లు, వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా సబ్సిడీ ప్రకటించింది. అందులోభాగంగా ఐఎస్‌బీ సెక్టార్ టైప్-1 కింద ఫ్లవర్‌బొకేలు, వర్మీకంపోస్ట్ యూనిట్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, ఎల్‌ఈడీ బల్బుల అసెంబ్లీ యూనిట్, ప్లంబింగ్, వాటర్ బాటిల్ రీసైక్లింగ్, వాటర్ రీసైక్లింగ్ యూనిట్లకు రూ.3 లక్షలు ఖర్చుకానుండగా, ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇవ్వనుంది. బ్యాంకు నుంచి 35శాతం రుణం, లబ్ధిదారుడు ఐదుశాతం పెట్టుబడి పెట్టాల్సి ఉంది. టైప్-2 కింద ఫిష్ ఫార్మింగ్, అడ్వెంచర్ టూరిజం, సబ్బుల తయారీ, మొబైల్ కార్‌వాష్, బేకరీ, ఫ్లైయాష్ బ్రిక్ యూనిట్, సెరికల్చర్, వెల్డింగ్, బ్యూటీపార్లర్, మెడికల్ ల్యాబ్ వంటి వ్యాపారాలు చేసుకునేవిధంగా ఒక్కో యూనిట్‌కు రూ.3 లక్షలు కేటాయించింది. ఇందులో 40 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకు రుణం, ఐదుశాతం లబ్ధిదారుడి వాటా కింద ఈ యూనిట్లను ప్రకటించింది. టైప్-3 కింద రూ.10 లక్షలకంటే ఎక్కువ రుణం విభాగంలో ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్ ప్రకటించింది. రవాణా రంగం విభాగంలో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల రుణం కింద మూడు చక్రాల ప్యాసింజర్ ఈ-ఆటో, నాలుగు చక్రాల ఆటో, కారు, గూడ్స్‌ట్రక్, వ్యవసాయ విభాగంలో డ్రోన్లు రుణం కింద అందించాలని నిర్ణయించింది. వీటిలో ప్రభుత్వ సబ్సిడీ 40 శాతం, బ్యాంకు రుణం 55 శాతం కింద ఉంది. ఈ నేపథ్యంలో ఈ యూనిట్లు పొందేందుకు మే 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. వైసీపీ ప్రభుత్వం గడచిన అయిదేళ్లలో ఎస్సీ కార్పొరేషన్‌ను పూర్తిగా మూసేసి ఎవరికీ రుణం అనేదే మంజూరు చేయలేదు. అయితే ప్రభుత్వం మారడంతో సీఎం చంద్రబాబు ఆదేశాలతో మళ్లీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు ఆదేశించింది. దీంతో ఇన్నేళ్ల తర్వాత పథకం తిరిగి ప్రారంభం కావడంతో భారీగా ఆశావహులు దరఖాస్తులు చేశారు. కాకినాడ జిల్లాకు 798 యూనిట్లు మంజూరవగా శనివారం నాటికి 5,497 మంది దరఖాస్తు చేశారు. కోనసీమ జిల్లాకు 1,043 యూనిట్లకుగాను 3,265 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది పోటీపడ్డారు.

సిఫార్సుల గోల..

ఇన్నేళ్ల తర్వాత పథకం అమలవుతుండడంతో ఈ యూనిట్లను దక్కించుకునేందుకు అప్పుడే పైరవీలు తీవ్రస్థాయిలో మొదలయ్యాయి. ఎలాగైనా తమకు పథకం వచ్చేలా చేయాలంటూ అనేకమంది దరఖాస్తుదారులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పైరవీలు చేయిస్తున్నారు. తమకు తెలిసిన నేతలను వెంటబెట్టుకుని అధికారులతో చెప్పాలంటూ తెగ ఒత్తిళ్లు తెస్తున్నారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కష్టపడ్డామని, ఇప్పుడు పథకానికి ఎంపికయ్యేలా చేయాలంటూ అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. ప్రధానంగా రూ.10 లక్షల యూనిట్ కింద ఇవ్వనున్న కార్లు, గూడ్స్‌ట్రక్, ఆటోల కోసం పైరవీలు ఎక్కువగా నడుస్తున్నాయి. కాకినాడలో అయితే ఇప్పటికే దరఖాస్తు రసీదుతో ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి మండలస్థాయి అధికారులకు చెప్పి తమ పేర్లు నమోదు చేయించాలని ప్రదక్షిణలు చేస్తున్నారు. కోనసీమలో యూనిట్లు కొంతవరకు ఎక్కువగా ఉండడంతో గడచిన వారం రోజులుగా ఎమ్మెల్యేల వద్దకు పైరవీకారులు పరుగులు తీస్తున్నారు. అటు తూర్పుగోదావరి జిల్లాలో ఉదయం లేచింది మొదలు పలువురు ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి కారు, ట్రక్కు, ఆటో తమకే వచ్చేలా చేయాలంటూ వెంటబడుతున్నారు. దీంతో కొందరు ఎమ్మెల్యేలు చేసేదిలేక అక్కడికక్కడే అధికారులకు ఫోన్లు చేసి ఫలానా వ్యక్తి తమవారని, కాస్త చూడండంటూ చెబుతున్నారు. ఇదే అదనుగా అధికారుల వద్దకు సైతం కొందరు దరఖాస్తుదారులు వెళ్లి ఎమ్మెల్యే చెప్పిన వ్యక్తి తామేనంటూ గుర్తుచేస్తున్నారు. ఇలా ఇప్పుడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రవాణా రంగం విభాగంలో ఇచ్చే యూనిట్ కోసం తెగ పైరవీలు చేస్తున్నారు. పథకం కింద రూ.10 లక్షల కారు తీసుకుంటే ఎలాగూ రూ.4 లక్షలు ప్రభుత్వం నుంచి సబ్సిడీ వస్తుండడంతో ఎక్కువమంది వీటికోసం తెగ పావులు కదుపుతున్నారు. అయితే అనేక నియోజకవర్గాల్లో దరఖాస్తుదారులపై గురిపెట్టి కొందరు చోటామోటా నేతలు పథకానికి ఎంపికయ్యేలా చూస్తామంటూ అప్పుడే సెట్టింగ్‌లు చేసుకుంటున్నారు. రూ.4 లక్షలు ఉచితంగా వస్తున్న నేపథ్యంలో తమకు రెండు విడతలుగా లక్ష ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో అనేకచోట్ల ఈ తంతు నడుస్తోంది. అటు పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో రూ.లక్ష ఇచ్చుకుంటే కచ్చితంగా ఎంపికవుతామని కొందరు నమ్ముతుండడం విశేషం. ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీతో చెప్పి పనిచేయిస్తామంటూ దళారులు వీరికి ఎరవేస్తున్నారు.

నిత్యావసర వస్తువులను

అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు

జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు



సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు

కలెక్టరేట్ (కాకినాడ), మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు హెచ్చరించారు. కాకినాడలో జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో శనివారం ఆయన ధరల నియంత్రణ కోసం కిరాణా మర్చంట్ల అసోసియేషన్, బియ్యం వ్యాపారస్తులు, హోల్‌సేల్ రిటైల్ వర్తకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, రైతు బజార్ ఎస్టేట్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రుద్రరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ నిత్యావసర వస్తువులైనా బియ్యం, పప్పు దినుసులు వంటివి అక్రమంగా నిల్వ చేసి ధరలు పెంచే ప్రయత్నం చేయవద్దన్నారు. జిల్లాలో ధరల నియంత్రణకు ప్రత్యేకంగా ధరల పర్యవేక్షణ సెల్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో నిత్యావసర వస్తువులు విక్రయించే ప్రతి దుకాణదారులు ధరల పట్టికను విధిగా ప్రదర్శించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ధరలను అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ప్రజలు ఇబ్బందులు పడకుండా సరసమైన ధరలకే నిత్యావసర వస్తువులను విక్రయించాలన్నారు. జిల్లాలో వినియోగదారులు ఫిర్యాదు చేస్తే వెంటనే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నిత్యావసర వస్తువులు విక్రయించే వ్యాపారస్తులు ఉన్నారు.

డాగ్, బాంబు స్క్వాడ్‌లతో గాలింపు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడ క్రైం, మే 10 (ఆంధ్రజ్యోతి): దాయాది దేశమైన పాకిస్థాన్‌ను నమ్మడానికి వీలులేని పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా పోలీసులు, త్రివిధ దళాలు అణువణువు జల్లెడపడుతున్నాయి. అందులో భాగంగా శత్రువర్గాలు దొంగదెబ్బ తీసేందుకు సమాచార వ్యవస్థ కీలకంగా ఉన్న నేపథ్యంలో ఆ వ్యవస్థను దెబ్బ తీసేందుకు అవకాశం ఉన్న దృష్ట్యా ప్రత్యేక పోలీసు బలగాలు కాకినాడ బీఎస్ఎన్ఎల్ జిల్లా కార్యాలయంలో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో గాలింపు చర్యలు నిర్వహించి రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీహరిబాబు, త్రీటౌన్ సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.9.60 కోట్లతో ఇండస్ట్రియల్ పార్క్

- జగ్గంపేటలో శంకుస్థాపన
- హాజరైన ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే నెహ్రూ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంతెన రామరాజు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేటరూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట గోకవరం రోడ్డులో ఇండస్ట్రియల్ పారిశ్రామిక నూతన భవనానికి శనివారం ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఇండస్ట్రియల్ పాలసీని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతగా 39 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్క్‌లను ఏర్పాటుచేస్తోంది. దీనిలో భాగంగా జగ్గంపేటలో కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.9.60 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని మంతెన రామరాజు తెలిపారు. 15 రోజుల్లో టెండర్లు పిలుస్తామని, 6 నెలల్లో ఈ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటుచేస్తామని, దీని వల్ల అనేక మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు రాబోయే రోజులు సువర్ణ యుగమన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారన్నారు. ఇక్కడ కాంప్లెక్స్ 5 ఎకరాల్లో నిర్మితమవుతుందన్నారు. సుమారు పారిశ్రామిక 20 హాళ్లను నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ భవనంలో మొట్టమొదటిగా ఐటీ ప్రొ సర్వీసెస్ ఏర్పాటుకు గోనాడ గ్రామానికి చెందిన నీలం అచ్యుత ముందుకువచ్చారని తద్వారా 200 మంది వరకు ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ రమణారెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ బి. పద్మజాదేవి, డిప్యూటీ జోనల్ మేనేజర్ బి. రాధామణి, తహశీల్దార్ రమేష్, ఎంపీడీవో ఎం.చంద్రశేఖర్, టీజేపీ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణవర్మ, మారిశెట్టి భద్రం, ఎన్వీఎస్ అప్పలరాజు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల భారీ ర్యాలీ

అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక



ర్యాలీ చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

కలెక్టరేట్ (కాకినాడ), మే10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వోలు) శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. కాకినాడ జీజీహెచ్ నుంచి కాకినాడ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవిడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ మాట్లాడుతూ జిల్లాలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పనిచేస్తున్న వారిలో ఆరేళ్లు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంక్రిమెంట్లు, హెచ్ఆర్ పాలసీను అమలుచేయాలని కోరారు. గత పదిరోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నామనీ, అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సందీప్, జిల్లా నాయకులు వరకాంత్, రఘు, ప్రతాప్, హేమంత్, నానాజీ, శ్వేత, రూప పాల్గొన్నారు.

'ఉపాధి' వేతనదారుల జీవనోపాధిని

మెరుగుపరిచే చర్యలు

తనిఖీ డైరెక్టర్ శ్రీకాంత్



ఉపాధి పనుల్లో తట్టతో మట్టిని ఎత్తుతున్న శ్రీకాంత్

కొత్తపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేతనదారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చర్యలు చేపట్టారని ఉపాధి హామీ సామాజిక తనిఖీ డైరెక్టర్ జీ.శ్రీకాంత్ అన్నారు. దీనిలో భాగంగా కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఉపాధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఉపాధి పనుల ప్రాముఖ్యత తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేతనదారులతో కాలువలో పూడిక తీస్తూ మట్టిని తట్టలను అందజేశారు. పీఆర్ఏ మ్యాపింగ్ ద్వారా ఉపాధి పనులను అవగాహన కల్పించి ఉపాధి పథకాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతీ కుటుంబం 100 రోజుల పనిపూర్తి చేసుకుని జీవనోపాధిని మెరుగుపరుచుకునేందుకు ఈ కార్యక్రమాన్ని జిల్లాలో కొండెవరంలో తొలుత చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్సుపర్సన్ గౌరీ శంకర్, సత్యనారాయణ, కోనయ్య తదితరులు ఉన్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్ (కాకినాడ), మే 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఒక ప్రకటన వెలువరించారు. సోమవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లా అధికారులు అందరూ హాజరుకావాలని తెలిపారు.





(ఆంధ్రజ్యోతి-కాకినాడ)



ఊరెళ్తున్నారా...

కాస్త చెప్పి వెళ్లండి!

- ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలపై కాకినాడ జిల్లా పోలీసుల విస్తృత ప్రచారం
- ఇళ్ల దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని పిలుపు
- నిఘా కెమెరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచన

ఏమిటిది... ఎలా పనిచేస్తుంది

ఎల్‌హెచ్ఎంఎస్.. ఇది ఓ నిఘా కెమెరా. ఇంటికి తాళం వేసి ఊరెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందిస్తే దానిని ఆ ఇంట్లో ఏర్పాటుచేసి వెళతారు. ఈ సేవలు పూర్తిగా ఉచితం. గరిష్ఠంగా 15 రోజుల వరకు ఇంట్లో ఈ సిస్టమ్ ఉంచే అవకాశం ఉంది. ఇంటి యజమానులు ముందుగా తమ ఏరియా పరిధిలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తమ ఇంటికి ఎల్‌హెచ్ఎంఎస్ సిస్టం అమర్చాలని కోరాలి. అప్పుడు వారు ఈ కెమెరాను ఇంటిలోపల అమర్చుతారు. దొంగలు ఎవరైనా ఇంట్లోకి ప్రవేశిస్తే పోలీసు కేంద్ర కార్యాలయంలో అలారం మోగుతుంది. అంతే కాదు.. ఇంటి యజమాని, సమీప పోలీసు స్టేషన్‌కు కూడా సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు ఐదు నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకుని చోరీని అడ్డుకునే అవకాశం ఉంది. దొంగలను కూడా పట్టుకుంటారు. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చి విస్తృత ప్రచారం చేశారు.



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై పోలీసు యంత్రాంగం విస్తృత ప్రచారం చేస్తోంది. సెలవుల్లో ఊర్లకు, టూర్లకు వెళ్లే వారు కచ్చితంగా ఈ సేవలను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. మరోవైపు ఈ సిస్టమ్‌పై అవగాహన ఉన్న వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. కాకినాడ జిల్లాలో ప్రస్తుతం 44 కెమెరాలను అందుబాటులో ఉంచారు. కాకినాడ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, సర్పవరం, ఇంద్రపాలెం, పోర్టు, గొల్లప్రోలు, పెద్దాపురం, సామర్లకోట, తుని పోలీసు స్టేషన్లలో ఈ కెమెరాలను అందుబాటులో ఉంచారు. గతేడాది ఈ సేవలను సుమారు 38 ఇళ్ల యజమానులు వినియోగించుకున్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను అమర్చడమే కాదు.. ఇద్దరు కానిస్టేబుళ్ల నిఘా కూడా ఆ ఇంటి పరిసరాల్లో ఉంటుంది.

యాప్ కూడా ఉంది...

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీసు అనే యాప్ కూడా అందుబాటులో ఉంది. ఈ యాప్‌ను మీ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసి ముందుగా రిజిస్టర్ అవ్వాలి. రిక్వెస్ట్ పోలీస్ వాచ్ అని ఉంటుంది. దానిపై క్లిక్ చేసి మీ వివరాలు, ఇంటి చిరునామా వివరాలు, మొబైల్ నెంబరు పొందుపరచాలి. మీరు ఉండే లోకేషన్ చూపిస్తుంది. తర్వాత మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. అలాగే మీ రిజిస్ట్రేషన్ విజయవంతమైనట్టుగా సాధారణ మెసేజ్ రూపంలో రిజిస్ట్రేషన్ నెంబరు వస్తుంది. ఆ నెంబరును వాచ్ రిక్వెస్ట్ ఫామ్‌లో ఎంటర్ చేసి.. ఎప్పుడు ఊరెళుతున్నారు? ఎప్పుడు వస్తారు? తేదీలను నమోదు చేయాలి. ఆ సమాచారం ఆధారంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ సర్వీస్ యాక్టివేషన్ ప్రారంభమవుతుంది.





సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే..

ఇంట్లో, ఇంటి బయట సీసీ కెమెరాలు తప్పనిసరిగా వేయించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఒక సీసీ కెమెరా వేయి కళ్లతో సమానమని చెప్తున్నారు. ప్రస్తుతం నేర, చోరీ సంబంధిత కేసుల్లో సీసీ కెమెరాలే కీలకంగా మారుతున్నాయంటున్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి ఇంటి నిర్మాణం చేసుకునేవారు.. కేవలం రూ.పదివేలలోపు ఉండే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నిరంతర పర్యవేక్షణ ఉంటుందని సూచిస్తున్నారు.

పర్యవేక్షణ పెంచాం

జిల్లాలో చోరీలను అరికట్టేందుకు గట్టి నిఘా, గస్తీ నిర్వహిస్తున్నాం. రాత్రివేళల్లో వాహనాలను తనిఖీ చేయిస్తున్నాం. అపరిచిత వ్యక్తులపైన, ఆరా, పాత నేరస్తుల పైన నిఘా ఉంచుతున్నాం. పగలు, రాత్రి కూడా డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నాం. ముఖ్యంగా సెలవుల్లో ఊర్లకు, విహారయాత్రలకు వెళ్లే వారు కచ్చితంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి. ఇళ్ల దొంగతనాలు అరికట్టేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. మీ సమీప పోలీసు స్టేషన్లో సమాచారం ఇస్తే వీటిని అందజేస్తారు.



జి.బిందుమాధవ్
ఎస్పీ, కాకినాడ జిల్లా

ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలన చేయాలి

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ జేడీ లక్ష్మీనారాయణ

పెద్దాపురం, మే 10(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం ఏడీబీ రోడ్డులో భారతీయ విద్య భవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ పరిచయం కార్యక్రమంలో జేడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో భారత్-పాక్ సీజ్ ఫైర్‌కు అంగీకరించాయన్నారు. అణ్వస్త్ర ఆయుధాలు కలిగి ఉన్న రెండు దేశాలు యుద్ధం చేయడం ప్రపంచ శాంతికి ప్రమాదకరమన్నారు. ఇందులో భాగంగానే భారత్-పాక్ మధ్య చర్చల ద్వారా కాల్పుల విరమణ జరగాలని ప్రపంచ దేశాలు సూచించాయి. చర్చలు పాక్ ఉగ్రవాదాన్ని ప్రేరేపించడాన్ని పూర్తి స్థాయిలో అడ్డుకోవాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఓ కమిటీ వేసి ఉగ్రవాదాన్ని వంద శాతం పరిసమాప్తం చేయాలని లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప, కౌడా తుమ్మల బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దాపురప్పాడు గంగమ్మ జాతర



అమ్మవారి ప్రతిరూపంగా కొలిచే బుట్టలోని గోవతాళ్లు

కరప, మే 10(ఆంధ్రజ్యోతి): పెద్దాపురప్పాడు గ్రామదేవత గంగమ్మతల్లి జాతరను ఆదివారం నుంచి మూడు రోజుల బాటు వైభవంగా నిర్వహించనున్నారు. మూడేళ్లకోసారి నిర్వహించే ఈ జాతరకు ఒక ప్రత్యేకత ఉంది. పూర్వం గ్రామంలోని గొల్లపల్లి వంశీకుల పొలాల్లో గోవతాళ్ల రూపంలో అమ్మవారు దొరకడంతో అప్పట్నుంచి గ్రామదేవతగా కొలుస్తున్నట్టు గ్రామస్తులు చెబుతారు. గోవతాళ్లను తాటాకుల బుట్టలో ఉంచి గుడి లోపల దూలానికి వేలాడదీస్తారు. ఆదివారం ఉదయం గోవతాళ్ల బుట్టను కిందకు దించి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. సోమ, మంగళవారాల్లో అమ్మవారిని ఊరేగించి ప్రత్యేకపూజలు చేస్తారు. ఈ జాతరకు దాదాపు 150 గ్రామాల్లో ఉండే గొల్లల కుటుంబాల వారు విచ్చేసి పండుగ మూడురోజులు గుడి ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లకు వేలాడుతూ తప్పెట గుళ్ల ఆడుతారు. నెలరోజుల ముందుగానే ఈ మేరకు ఆ కుటుంబాలకు అమ్మవారి శేష అక్షింతలతో కూడిన ప్రత్యేక ఆహ్వాన పత్రికలు అందుతాయి. గంగమ్మతల్లి జాతరను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారు. దీనికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, ఆలయ కమిటీ సభ్యులు గొల్లపల్లి అప్పన్నకాపు, గొల్లపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కనకాల రామ్మోహనరావు, గొల్లపల్లి శ్రీనివాస్, గొల్లపల్లి గంగాప్రసాదరావు తదితరులు తెలిపారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరప ఎస్‌ఐ తోట సునీత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యప్రదర్శన

నల్లజర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వేణు గోపాలస్వామి తిరుకల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం కనకదుర్గ భక్తసమాజం ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, నిత్య హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం క్రేజీ మాస్టర్ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో చిన్నారులతో నిర్వహించిన కూచిపూడి, వెస్ట్రన్ డ్యాన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివారం రాత్రి ఏడుగంటలకు స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ మద్దిపాటి చంద్రశేఖర్ తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు

కొవ్వూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమలో విఫలమవ్వడంతో గోదావరిలో ఓ యువతి దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించడంతో పట్టణ పోలీసులు రక్షించారు. వివరాలివి... నిడదవోలు పట్టణానికి చెందిన 21 సంవత్సరాల యువతి వైజాగ్‌లో అప్తామాలజిస్టు చదువుతుంది. లవ్ ఫెయిల్ కావడంతో శనివారం సాయంత్రం రోడ్డు కం రైలు వంతెన పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. పోలీసులు రక్షించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చి యువతి తల్లికి అప్పగించారు.

6ఏ కేసు నమోదు

గోపాలపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): కరగపాడు రేషన్ షాప నెంబర్- 33 ఇన్‌చార్జిపై 6ఏ కేసు నమోదు చేసినట్టు సివిల్ సప్లై డీటీ దివాకర్ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి తనిఖీ చేయగా, రికార్డు స్టాకుకు 15 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించామన్నారు. దీంతో నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

భక్తజన నీరాజనం

- వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.53 లక్షలు



వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తులు



ఆత్రేయపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.53,00,904 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారి సన్నిధిలో సత్యసాయి బా లవికాశ్ విద్యార్థులచే భక్తులకు రసనా చలివేంద్రం అందించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని వేదాశీర్వచనం అందుకున్నారు.

ఊక బస్తాలే.. రేషన్ బస్తాలు

రాజాపూడి రేషన్ డీలర్ మాయాజాలం

బియ్యాన్ని అమ్మేసుకున్న వైనం..



బియ్యానికి బదులు ఊకతో నింపిన బస్తాలు

జగ్గంపేట రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలో రేషన్ డీలర్ మాయాజాలం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. రేషన్ బస్తాలకు బదులు ఊక బస్తాలను రేషన్ స్టాక్‌గా చూపించిన వైనం వెలుగులోకి వచ్చింది. రేషన్ బియ్యాన్ని విక్రయించుకుని ఊక బస్తాలను స్టాక్‌గా చూపిస్తూ అధికారులను డీలర్ బురిడీ కొట్టించాడు. లబ్ధిదారులు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగి అక్రమాలను వెలికితీశారు. రాజాపూడి గ్రామంలో షాపు నెంబర్ 041805లో 602మంది లబ్ధిదారులకు గాను ఇప్పటివరకు 240 మంది రేషన్ తీసుకున్నారు. ప్రస్తుతం ఈ షాపులో 5,255 కిలోల బియ్యం స్టాక్ ఉండాల్సిన ఉండగా 265 కిలోలు మాత్రమే ఉంది. అధికారులు స్టాక్ పాయింట్‌ను చెక్ చేయగా 45 బస్తాల్లో రేషన్ బియ్యానికి బదులు ఊక బస్తాలు ఉన్నట్టు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించడంతో డిపోను సీజ్ చేశామని, తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణ రాజు తెలిపారు. కార్యక్రమంలో సహాయ పౌర సరఫరాల అధికారి టి.ప్రసన్న లక్ష్మి, తహశీల్దార్ రమేష్ పాల్గొన్నారు.



డీలర్ నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

బాలబాలాజీ ఆలయంలో భక్తుల కోలాహలం



బాలబాలాజీ దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు, మే 10(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం భక్తుల కోలాహలంతో కళకళ్లాడింది. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అర్చక స్వాములు వేద మంత్రోచ్చారణల నడుమ సుప్రభాత సేవ నిర్వహించి స్వామివారికి తొలి హారతి ఇచ్చారు. శనివారం పురస్కరించుకుని స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 5,500మంది దర్శించుకుని 3200మంది నిత్యాన్నదాన పథకంలో అన్నదానం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.4,06,417 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందుల తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



అప్పనపల్లి బాలబాలాజీస్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

ఆదాయం రూ.3,16,011



పెద్దాపురం, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 15వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. రూ.3,16,011 ఆదాయం ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

కేశవస్వామి ఆలయంలో డిప్యూటీ కలెక్టర్ పూజలు



డిప్యూటీ కలెక్టర్‌కు స్వామి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మే 10(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం సింహాచలం వరహాలక్ష్మి నరసింహస్వామి ఆలయ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్నదాన పథకానికి రూ.1,11,116 విరాళం

కేశవస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణలోని శేరిలింగంపల్లికి చెందిన బళ్లా వీరభద్రం-సరిత దంపతులు రూ.1,11,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామి దర్శనం కల్పించి వేదశీర్వచనం అందజేశారు.





పిఠాపురంలో సూర్యోదయం వేళ అరుణ వర్ణ శోభితమైన ఆకాశం, పట్టణంలో సూర్యోదయ సమయాన అరుణకాంతులు



అరుణవర్ణంలో పిఠాపురంలోని రహదారి

ఆకాశం అరుణవర్ణ శోభితం

పిఠాపురంలో కనువిందు

ఆకాశం అరుణవర్ణ శోభితమైంది. సూర్యోదయ సమయాన శనివారం ఉదయం పిఠాపురం పట్టణంలో కనిపించిన దృశ్యాలు కనువిందు చేశాయి. ఆకాశం ఎరుపు రంగులోకి మారినట్లుగా సూర్యుడు చెట్లుచాటు నుంచి వస్తున్న దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఆకాశమేగాక సూర్యకాంతితో రహదారి అంతా అరుణవర్ణంలో కనిపించింది. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది. - పిఠాపురం, (ఆంధ్రజ్యోతి)

ఏలేరులో నీటి నిల్వలు తగ్గుముఖం



తగ్గుతున్న ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, మే10 (ఆంధ్రజ్యోతి):ఏలేరు జలాశయంలో నీటినిల్వలు తగ్గుముఖం పట్టాయి. ఎండతీవ్రత పెరగడంతో ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహం తగ్గడంతో ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 86.56 మీటర్లుకాగా శనివారం 76.55 మీటర్లుగా నమోదైంది. పూర్తిస్థాయి నిల్వలసామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.74 టీఎంసీల మేర మాత్రమే నీటినిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం విశాఖకు 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.

అమ్మఒడి పేరుతో మోసంపై కేసు నమోదు

- ఆంధ్రజ్యోతి కథనంపై కలెక్టర్ ఆరా
- మోసానికి పాల్పడిన వారిని గుర్తించాలని ఆదేశం

పిఠాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): అమ్మఒడి పేరుతో ఫోన్‌కాల్స్ ద్వారా పలువురిని మోసగించిన సంఘటనపై కాకినాడజిల్లా పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అమరావతి సచివాలయం నుంచి ఆఫీసర్‌ను మాట్లాడుతున్నానంటూ ఒక వ్యక్తి పలువురికి ఫోన్‌చేసి మీకు అమ్మఒడి డబ్బులు గత ఏడాది పడలేదని, ఈఏడాదితో కలిపి రెండేళ్ల సొమ్ములు పడాలంటే తాను చెప్పినట్లు వాట్సాప్ షేరింగ్, ఫోన్ పే ద్వారా చేయాలని, ముందుకు రూపాయి పంపి ఆ తర్వాత లింక్‌ను క్లిక్ చేయాలనిచెప్పి ఓటీపీ చెప్పమని చెప్పి బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ములు లాగేసి పలువురిని మోసంచేసిన సంఘటనపై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. పిఠాపురం నియోజకవర్గంలో పలువురికి ఈవిధంగా ఫోన్లు వచ్చి మోసపోయిన సంఘటనపై జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ స్పందించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తా కథనంపై వివరాలు కోరారు. మోసానికి పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని కలెక్టర్ పోలీసులను ఆదేశించారు. ఎవరెవరికి ఫోన్లు వచ్చాయి, ఎంత మేర మోసపోయారు తదితర వివరాలు సేకరించాలని అధికారులకు సూచించారు. మరోవైపు అమ్మఒడి పేరుతో ఫోన్ రాగా తన ఖాతా నుంచి రూ.35వేలు కాజేశారని, తాను మోసపోయానంటూ గోకివాడ గ్రామానికి చెందిన రాంబాబు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై పిఠాపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. గత రెండు రోజులుగా నియోజకవర్గంలో పలువురికి ఇదే విధంగా ఫోన్లు వచ్చినట్లు చెప్పారు. ఈ విధంగా ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే సమీపంలోని పోలీసుస్టేషన్లల్లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఇటువంటి ఫేక్ కాల్స్‌కు ఎవ్వరూ స్పందించవద్దని కోరారు.

బీఐఎస్ సమన్వయ కమిటీ సభ్యుడిగా ఎస్పీ రెడ్డి



సర్పవరంజంక్షన్, మే 10(ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రమాణాల సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సమన్వయ కమిటీ సభ్యుడిగా కాకినాడ ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దేశంలో దివ్యాంగులకు అందిస్తున్న సహాయ పరికరాల నాణ్యతను పరిశీలన, ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం బీఐఎస్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటుచేసిందని ఎస్పీ రెడ్డి తెలిపారు. జాతీయస్థాయి కమిటీలో ముగ్గురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉండగా మానసిక దివ్యాంగులకు సేవలు అందించే విభాగంలో కోఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా తనకు అవకాశం కల్పించినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు నాణ్యమైన పరికరాలు, సేవలు అందేలా తనవంతు కృషి చేస్తానన్నారు.

80 స్లయిసెస్ సిటీ స్కాన్ యంత్రం ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ) మే 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో అత్యాధునిక 80స్లయిసెస్ సిటీస్కాన్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. ఈయంత్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ శనివారం ప్రారంభించారు. ఎస్ఎల్ డయాగ్నొసెస్ సంస్థ పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న సిటీస్కాన్ యంత్రం ఇప్పటివరకు 16 స్లయిసెస్ సామర్థ్యంతో మాత్రమే నడిచేది. ఈసందర్భంగా డాక్టర్ విఠల్ మాట్లాడుతూ రోగుల తాకిడితో జీజీహెచ్‌పై ఒత్తిడి అధికమవుతున్న నేపథ్యంలో ఈ అధునాతన 80 స్లయిసెస్ సిటీస్కాన్ పరికరం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.



సిటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ విఠల్

ఘనంగా పండిత సదస్యం



పండిత సదస్యం కార్యక్రమానికి హాజరైన వేదపండితులు, పొన్నవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

- సుమారు 192 మంది పండితులకు సత్కారం
- వేదఘోషతో పులకించిన సత్యదేవుడి సన్నిధి



పండితులను సత్కరిస్తున్న చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు

అన్నవరం, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి శనివారం వేదఘోషతో పులకించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేదాలలో నిష్ణాతులైన పండితులు తమ వేదవిద్యను స్వామివారి పాదాలచెంత ఉంచి పునీతులయ్యారు. స్వామివారి దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం పండిత సదస్యం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం 3గంటలకు నవవధూవరులైన సత్యదేవుడు, అనంత లక్ష్మి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అనివేటి మండపం వద్దకు తోడ్కొనివచ్చారు. సర్వాంగసుందరంగా అలంకరించి న వేదికపై ఆశీనులు గావించి మరో వేదికపై క్షేత్ర పాలకులు సీతారాములను ఉంచి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పండితులంతా తమ పాండిత్యాన్ని స్వామిపాదాల చెంత వినిపించారు. అనంతరం రాష్ట్రం నలుమాలల నుంచి విచ్చేసిన సుమారు 192మంది పండితులను పూలమాలలు, దుశ్శాలువా కప్పి, విసినకర్రను అందజేసిన గదు పురస్కారాలను ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు అందజేశారు. పండితులకు సుమారు రూ.6.80 లక్షలు వారి అకౌంట్‌లకు జమచేశారు. కార్యక్రమం అనంతరం పండితులంతా నవ దంపతులకు వేదాశీర్వచనాలు అందజేశారు.

పొన్నవాహనంపై విహరించిన స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా శనివారంరాత్రి నవదంపతులు పొన్నవాహనంపై విహరించారు. చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావులు టెంకాయికొట్టి కార్యక్రమం ప్రారంభించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

నేడు సత్యదేవుడి రథోత్సవం

- భక్తుల సౌకర్యార్థం మెయిన్‌రోడ్డులో దుకాణ సముదాయాల మూసివేత
- విద్యుత్ సరఫరా నిలిపివేత

అన్నవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవ కార్యక్రమం జరుగనుంది. అత్యంత కీలకమైన ఈ రథోత్సవం నిర్వహణ, పర్యవేక్షణకు దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ ప్రత్యేకంగా ఇద్దరు డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులను నియమించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మెయిన్‌రోడ్డులో ఈ వేడుక జరుగనుంది. భక్తులు, గ్రామస్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్థానిక ఆంధ్రాబ్యాంక్ నుంచి కళాశాల మైదానం వరకు మెయిన్‌రోడ్డులో ఉదయం 10గంటల నుంచి రథోత్సవం ముగిసే వరకు దుకాణ సముదాయాలు మూసివేయాలని అన్నవరం ఎస్.ఐ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను బైపాస్‌రోడ్డు ద్వారా మళ్లిస్తున్నామన్నారు. విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా ముందుజాగ్రత్త చర్యగా మెయిన్‌రోడ్డులో ఉదయం 10గంటలనుంచి రాత్రి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు ప్రకటించారు.



స్వామివారు విహరించనున్న పెద్దరథం

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

- జేఎన్టీయూకే ఉపకులపతి ప్రసాద్
- విశ్వవిద్యాలయ క్రీడాదినోత్సవ వేడుకలు



జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుడికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న వీసీ ప్రసాద్, రెక్టార్ కేవీ రమణ

జేఎన్టీయూకే, మే 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటూ క్రీడల్లో కూడా రాణించడం ద్వారా వారిలో వ్యక్తిత్వ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. వర్శిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో విశ్వవిద్యాలయ క్రీడాదినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. రెక్టార్ కేవీరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈవేడుకలకు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ గుబిలి శ్యామ్‌కుమార్, ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్స్ కార్యదర్శి డాక్టర్ జీపీరాజు సమన్వయకర్తలుగా వ్యవహరించగా ముఖ్యఅతిథిగా ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు. మొదటిగా పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమరులైన భారతదేశానికి చెందిన వీరజవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఒక నిమిషంపాటూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడు తూ మన లక్ష్యాలను చేరుకునేందుకు క్రీడలు ఒక అద్భుతమైన అవకాశమని క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వానికి, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ 2024-25 విద్యాసంవత్సరంలో వర్శిటీ తరఫున నిర్వహించిన క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల వివరాలతో వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం జేఎన్టీయూకే తరఫున జాతీయస్థాయి క్రీడా పోటీ ల్లో పాల్గొన్న క్రీడాకారులకు, విజేతలకు, పీడీలకు, కోచ్‌లకు, మేనేజర్లకు సర్టిఫికెట్లతో పాటూ నగదు బహుమతిని అతిథులు అందజేశారు. మాజీ ఉపకులపతులు, సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వర్శిటీ అనుబంధ కళాశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

- మృతుడు చాగల్లువాసిగా గుర్తింపు

కొవ్వూరు, మే 10(ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలోకి దూకి వ్యక్తిఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కొవ్వూరు-రాజమహేంద్రవరం మధ్య గోదావరిపై నిర్మించిన రోడ్డు కంరైలు బ్రిడ్జి 148వ స్తంభంవద్ద చోటుచేసుకుంది. శనివారం ఉదయం 10.30గంటల సమయంలో సుమారు 60 సంవత్సరాల వృద్ధుడు చెప్పులు, షర్ట్ ఉంచి బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి దూకేశాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు చాగల్లుకి చెందిన కొడవ టి సుబ్రహ్మణ్యం (60)గా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం

జీజీహెచ్(కాకినాడ) మే 10 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా ఉన్నతమైన ఫలితాలు సాధించవచ్చని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం పేర్కొన్నారు. కాకినాడ జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్ విభా గ సెమినార్ హాల్లో శనివారం ఆర్థోపెడిక్ విభాగం సమకూర్చిన రూ.2.82లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డ్ ఇంటరాక్టివ్ టీవీని డాక్టర్ నరసింహం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాల బోధనకు దోహదపడుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్య రంగంలో పెనుమార్పులు వస్తున్నాయన్నారు. కాలంతో పోటీపడి అనుకున్న లక్ష్యాలను అధిగమించేందుకు విద్యార్థులకు ఇటువ ంటి టెక్నాలజీని సమకూర్చిన ఆర్థోపెడిక్ విభాగాధిపతి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్‌ను డీఎంఈ అభినందించారు. డాక్టర్ విఠల్ మాట్లాడుతూ డిజిటల్ బోర్డ్ ఇంటరాక్టివ్ టీవీ ద్వారా అధునాతన విధానంలో వైద్య విద్యార్థులకు బోధనలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా శస్త్రచికిత్స విధానం ద్వా రా అవగాహన, అనుభవాలు అందజేయడానికి దోహదపడుతుందన్నారు. ఆపరేషన్ థియేటర్‌ను అనుసంధానం చేసి క్లిష్టమైన, అరుదైన కేసులపై పీజీ విద్యార్థులకు శిక్షణా తరగతులు బోధించడం సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, జనరల్ మెడిసన్ హెచ్‌వోడీ డాక్టర్ పి.యశోదమ్మ, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

బీరు బాటిళ్లతో వ్యక్తిపై దాడి

- తీవ్ర గాయాలు, అడ్డువచ్చిన కుమార్తెకు గాయాలు



బీరు బాటిళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వెంకటరమణ

పిఠాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో ఒక వ్యక్తిపై కొందరు యువకులు శనివారం రాత్రి బీరు బాటిళ్లతో విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. అడ్డువచ్చిన ఆ వ్యక్తి కుమార్తెకు గాయాలయ్యాయి. పట్టణంలోని కత్తుల గూడెంలో పెళ్లి సందర్భంగా మనోజ్ అనే యువకుడితో ఉదయకిరణ్ అతని స్నేహితులు గొడవకు దిగారు. దీనిని గమనించిన మనోజ్‌ను అతని తల్లిదండ్రులు దిమ్మిలి వెంకటరమణ, అచ్యుతమ్మలు అక్కడి నుంచి తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత ఉదయకిరణ్ తన స్నేహితులతో కలిసి మనోజ్ ఇంటికి వచ్చి మరలా గొడవకు దిగారు. ఈ సమయంలో అడ్డుగా వచ్చిన మనోజ్ తండ్రి వెంకటరమణపై బీరుబాటిళ్లతో విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచారు. అడ్డు వచ్చిన అతని కుమార్తె అయితే దివ్యకు గాయాలయ్యా యి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటరమణకు శరీరంపై పలుచోట్ల గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాదంలో మృతిచెందిన నాగబాబు

ముమ్మిడివరం, మే 10(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా 216 జాతీయ రహదారి ముమ్మిడివరం కొండాలమ్మచింత బైపాస్ రోడ్డులో శనివారం ఓ యువకుడు దుర్మరణం చెందాడు. యానాం వైపు నుంచి పల్సర్ మోటారు సైకిల్‌పై వస్తున్న యువకుడిని ముమ్మిడివరం బైపాస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న టాటాఏస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అల్లవరం మండలం కోడూరుపాడు శివారు నక్కల వుంతకు చెందిన నవరపు నాగబాబు (28) ఈ ప్రమాదంలో మృతిచెందాడు. నాగబాబు ధాన్యం పట్టుబడి జట్టులో పనిచేస్తుంటాడు. పది రోజులుగా పి.గన్నవరం మండలం పోతవరంలో ధాన్యం పట్టుబడిలో పనిచేసి శుక్రవారమే ఇంటికి తిరిగి వచ్చాడు. నాగబాబు శనివారం యానాం వెళ్లి తిరిగి వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యాడు. మృతుడు నాగబాబుకు భార్య రేణుక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రేణుక ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుంది. నాగబాబు అత్తవారి ఊరు పి.గన్నవరం మండలం ముంగండపాలెం. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళాలు పగులకొట్టి బంగారం చోరీ

- రూ.4.50లక్షలు విలువైన బంగారం, వెండి వస్తువుల అపహరణ



పరిశీలిస్తున్న రూరల్ సీఐ విజయ్‌బాబు

కొవ్వూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిఉన్న ఇంటి తలుపులు పగులకొట్టి రూ.4.50 లక్షలు విలువైన బంగారు, వెండి వస్తువులు అపహరించుకుపోయినట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మద్దూరు గ్రామానికి చెందిన పుసులూరి కిశోర్ కుమార్ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో జరిగే పెళ్లికి ఈనెల 9వ తేదీన తణుకు వెళ్లాడు. తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామగ్రి చిందరవందరగా పడి ఉం డడంతో దొంగతనం జరిగినట్టు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 21 కాసుల బంగారం వస్తువులు, 500 గ్రాముల వెండి దొంగిలించుకుపోయినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వెంటనే క్రైం జిల్లా అడిషనల్ ఎస్పీ అర్జున్, ఇంచార్జి డిఎస్పీ కె.వి.వి.సత్యనారాయణ, రూరల్ సీఐ కె. విజయ్‌బాబు, రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి రావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కిశోర్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రత్నగిరిపై భక్తుడి కారు నుంచి మంటలు

అన్నవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తుడి కారు నుంచి శనివారం మంటలు వ్యాపించడంతో పెనుప్రమాదం తప్పిం ది. వివరాల్లోకి వెళితే ధవళేశ్వరం నుంచి నలుగురు కుటుంబ సభ్యులు స్వా మిసన్నిధికి కారులో విచ్చేశారు. కారు సీఆర్వో కార్యాలయంవద్దకు చేరుకోగానే కారు ఇంజన్ నుంచి మంటలు రావడంతో భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. కారునుంచి భక్తులు బయటకు రాగా సెక్యూరిటీ సిబ్బంది ఫైర్ సిలిండర్లు ఉపయోగించి మంటలను అదుపుచేశారు. ఈప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



కారు నుంచి మంటలు వస్తున్న, మంటలను ఆర్పుతున్న దృశ్యం

నిత్యావసరాల పంపిణీ

సర్పవరం జంక్షన్, మే 10 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంఘం కోశాధికారి శ్రీదేవి, సభ్యులు శాంతి, మాధవిలత, పద్మ, దీపిక, అడబాల రత్న ప్రసాదరావు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళి



వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ సరిహద్దులో జరిగిన కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితాండ్ర గ్రామానికి చెందిన మురళి నాయక్ అమరుడని శనివారం రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ముందుగా మురళి నాయక్ చిత్రపటానికి పూల మాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎంపీ అనుచరులు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్లు దేశానికి గర్వకారణమన్నారు. మురళి నాయక్ చేసిన త్యాగం మరిచిపోలేని ఘట్టమని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయన సాహసం, వీరత్వాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని), కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణ మూర్తి, న్యూటన్ ఆనంద్, గింజాల శ్రీనివాస్, చింతపల్లి అర్జున్, బండి నరేంద్ర, ముత్యాల అనిల్, యాళ్ల చక్రవర్తి, కళ్యాణి రమేష్, రవి, నాని, వాసు పాల్గొన్నారు.

రేపు 'అరుణోదయం' ముగింపు సభ



గొల్లప్రోలులో ముగింపు సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐఎఫ్‌టీయూ ప్రతినిధులు

గొల్లప్రోలు, మే 10 (ఆంధ్రజ్యోతి): అరుణోదయం సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల ముగింపు సభ ఈనెల 12న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను గొల్లప్రోలులో శనివారం రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ప్రతినిధులు ఆవిష్కరించారు. ఆపరేషన్ ఖగార్‌ను నిలిపివేసి తక్షణం మావోయిస్టులతో చర్చలు జరపాలని రమేష్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలకు అడవుల్లో సంపదను దోచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, పీడీఎస్‌యూ విజృంభన రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, నాయకులు డి.నారాయణమూర్తి, గొర్ల శివ, శ్రీధర్, వేగిశెట్టి గణేష్ తదితరులున్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం



కాకినాడ రూరల్: శిక్షణా శిబిరం ముగింపులో పాల్గొన్న ఎంఈవోలు సత్యనారాయణ, రవి

కాకినాడ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కాకినాడ అర్బన్ మండలంలోని దుమ్ములపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల్లో 10 రోజులపాటూ నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. వేసవి వినోదం శిక్షణా కార్యక్రమంలో భాగంగా కార్యక్రమం ముగింపులో విద్యార్థులు తయారుచేసిన క్రాఫ్టలు, డ్రాయింగ్ చార్టులు ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా కరప మండలం ఎంఈవో పి.సత్యనారాయణ హాజరై విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి బహుమతులను అందజేశారు. ఎంఈవో సీహెచ్ రవి, ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్ ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు

కాకినాడ సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): ముస్లిం పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం కాకినాడ మసీద్ కమిటీ ఆధ్వర్యంలో జగన్నాధపురంలోని మదరసా ఇస్లామియా అహ్మదియా హాస్టల్‌లో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా శనివారం విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాదర్ ఆలీ ఖాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త బషీర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మసీద్ ఇమామ్ ప్రభుత్వ ఖాజీ గౌస్ మొహిద్దీన్ హబీబీ, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాదర్ ఆలీఖాన్, మసీద్ కమిటీ సభ్యులు మహబూబ్ బాషా, ఎండీ అన్సర్, ఎహెచ్‌కె దుర్రాని అజీవుద్దీన్, ఖాదరీ జిలాని, ఆలీషా, కశీం, సందాని, షమ్మిల్లా, ముజిబుల్లాఖాన్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు నిరసనగా పిఠాపురంలో ర్యాలీ



పిఠాపురంలో ఏపీ మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శన

పిఠాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పిఠాపురంలో శనివారం సాయంత్రం ఏపీ మాలమహానాడు ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధమని, తక్షణం నిలుపుదల చేయాలని ఏపీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బలరాజు తెలిపారు. వర్గీకరణను విరమించుకోకుంటే దీనికి మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలన్నింటికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తహశీల్దారు కార్యాలయం వరకూ ప్రదర్శన జరిపి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పీవీ రావు చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుంటామని నాయకులు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు దారా వెంకట్రావు, దడాల సత్తిబాబు, కండెల్లి వీరబాబు, మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎడ్ల లక్ష్మీపతి, ముంజవరపు కృపానందం, వడ్డి ప్రవీణ్, జగడం రవి, దాట్ల సూరిబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కొత్తపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): ఉప్పాడ-కొత్తపల్లి వీర్రాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం జరిగింది. ఎక్కడెక్కడో ఉద్యోగ, వ్యాపార రీత్యా స్థిరపడిన వారంతా ఉప్పాడ కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. ఆనాటి గురువులైన కామరాజు, నాగేశ్వరరావు, వీరభద్రరావు, పీఎస్‌వీ.సత్యనారాయణ, సూర్రెడ్డి, శ్రీలక్ష్మి, రాంబాబు, ఉమామహేశ్వరరావు మాస్టార్లకు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పాఠశాలకు ఆర్చ్ ఏర్పాటు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. జోకా ప్రసాద్, అడపా కన్నకుమార్, సానా లక్ష్మణరావు, భుజంగరావు, అన్నపూర్ణ, సునీత తదితర ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



ఉప్పాడ కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

అప్పుడే లీకులా..?


- అన్న క్యాంటీన్ భవన నిర్మాణంలో తగు జాగ్రత్తలు తీసుకోని ఇంజనీరింగ్ అధికారులు
- ప్రారంభించిన కొన్ని రోజులకే నాణ్యత లోపాలు



గొల్లప్రోలులో అన్న క్యాంటీన్ భవనం



అన్న క్యాంటీన్ భవనం నుంచి లీకవుతున్న నీరు



శ్లాబు పై భాగంలో లీకులు

గొల్లప్రోలు, మే 10 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ భవనం ప్రారంభించిన తర్వాత నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. చిన్నపాటి వర్షానికి, ట్యాంకులో నీరు ఎక్కువైనా ఎక్కడికక్కడ లీకు అవుతుండటం విస్మయం కలిగిస్తోంది. ముందుగానే ఉన్నతాధికారులు హెచ్చరించినా ఇంజనీరింగ్ అధికారులు బేఖాతరు చేయడంతోనే ఈ పరిసితి ఏర్పడిందన్న విమర్శలు ఉన్నాయి.

గొల్లప్రోలులోని అన్నక్యాంటీన్ భవన నిర్మాణాన్ని 2018-19 సంవత్సరంలో చేపట్టారు. వైసీపీ హయాంలో పనులు పూర్తి చేయకుండా వదిలివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.19.8 లక్షలు అదనంగా కేటాయించి పనులు పూర్తి చేశారు. ఈనెల 4న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్సీ నాగబాబు ప్రారంభించారు. ప్రారంభించిన రెండు వారాల నుంచే నాణ్యతాలోపాలు వెలుగుచూస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు డైనింగ్‌హాలు, కిచెన్, కంప్యూటర్లు ఉన్న ప్రాంతాల్లో నీరు కారింది. ట్యాంక్ క్లీన్ చేయడానికి నీరు వదలగా అదే పరిస్థితి నెలకొంది. పనులు జరుగుతున్న సమయంలోనే పబ్లిక్‌హెల్త్ ఎస్‌ఈ సుధాకర్ పరిశీలనకు వచ్చి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినా ఇంజనీరింగ్ అధికారులు తగుజాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. మరోవైపు శ్లాబులు, ఇతర ప్రాంతాల్లో నీరు లీకవుతున్న విషయాన్ని అన్న క్యాంటీన్ సిబ్బంది నగరపంచాయతీ కమిషనరు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఈ లోపాలను సరిదిద్దే పనిలో అధికారులు ఉన్నారు. లక్షలాది రూపాయిల వ్యయంతో జరుగుతున్న పనులపై ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలేకపోవడమే ఇందుకుకారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆర్మీకి మద్దతుగా ప్రత్యేక పూజలు



సర్పవరం జంక్షన్‌లో శ్రీవేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



పిఠాపురం పాదగయ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సర్పవరం జంక్షన్, మే 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ పార్టీ ఆదేశాల మేరకు ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న భారత ఆర్మీకి మద్దతుగా శనివారం బీజేపీ నాయకుడు తుమ్మలపల్లి నారాయణరావు ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టెర్రరిస్టులను సమూలంగా నాశనం చేయడం ద్వారా దేశం భద్రతంగా ఉండేలా ఆ భగవంతుడు ఆశీస్సులు త్రివిధ దళాల సిబ్బందికి లభించాలని కోరుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పైడా కృష్ణ మోహన్, పైడా భావన ప్రసాద్, కాళ్ల ధనరాజు, పక్కి మణిబాల, కంచుమర్తి చినఅప్పాజీ, చోడిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: యుద్ధభూమిలో సైనికులు, సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షితంగా ఉండాలని ప్రార్థిస్తూ పట్టణంలోని ఆలయాల్లో శనివారం బీజేపీ నాయకులు పూజలు నిర్వహించారు. పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, కంబాల నాగేశ్వరరావు, తోట ఏడుకొండలు, పసుపులేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

సామర్లకోట: భారత సైనికులకు ఆరోగ్యం, శక్తి, సామర్థ్యంతో పాటు దేశానికి మంచి కలగాలని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీమతి తుమ్మల పద్మజ ఆధ్వర్యంలో సామర్లకోట పంచారాయ క్షేత్రం కుమార భీమేశ్వరాలయంలో అభిషేక అర్చన, కుంకుమపూజ నిర్వహించారు. కాటంరెడ్డి ఏడుకొండలు, పూర్వపు బీజేపీ టౌన్ అధ్యక్షుడు కాళ్ళదుర్గాప్రసాద్, రాజేష్, నిమ్మగడ్డ సతీష్, పెజ్జు గణేష్, అల్లు ప్రసాద్, హిందూధర్మ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సంఘీభావం

కాకినాడ సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత జవాన్లకు నాయీబ్రాహ్మణులు సంఘీభావం తెలిపారు. జిల్లా నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక మెయిన్‌రోడ్‌లోని జిల్లా సంఘ కార్యాలయంలో సమావేశమ్యారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని వక్తలు పేర్కొన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో భారతీయుల ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం ఆపరేషన్ సిందూర్ చర్యతో 140 కోట్ల భారతీయులు గర్వపడేలా ఉగ్రవాద స్థావరాలను దెబ్బతీయడం జరిగిందన్నారు. ఇందుకు రంగం లోకి దిగిన ప్రధాని మోదీ, కేంద్ర త్రివిధ బలగాలు, జవాన్లు అభినందనీయులన్నారు. సమావేశంలో జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వయంభరపు శ్రీనివా సరావు, 93 బీసీ కులాల నగర అధ్యక్షుడు ఆవుపాటి ఉమాశంకర్, గరగ నృత్య వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు పసుపులేటి సూరి బాబు, సంఘ నాయకులు కొవ్వాడ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

సముద్రతీరంలో మెరైన్ పోలీసుల పటిష్ఠ నిఘా

అపరిచిత వ్యక్తులు కనిపిస్తే తక్షణం సమాచారం ఇవ్వాలి

సీఐ రామ్మోహన్‌రెడ్డి

సర్పవరం జంక్షన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఇండియా-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం వాతావరణం నేపథ్యంలో కాకినాడ సముద్ర తీరంలో మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ టిరామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. శనివారం కుంభాభిషేకం, వాకలపూడి, సూర్యారావుపేట ఎన్టీఆర్ సముద్ర తీర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో, సముద్ర తీరంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపించినా, సంచరించినా తక్షణమే మెరైన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని మత్స్యకారులను కోరారు. పాకిస్థాన్ ఉగ్రస్థావరాలను భారత త్రివిధ దళాలు ధ్వంసం చేసిన నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సిబ్బంది తీరప్రాంతంలో పూర్తి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తీరప్రాంత గస్తీ, పహారాపై సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ బి శ్రీనివాస్, బివరప్రసాద్, మహిళా కానిస్టేబుల్ రామలక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారు.



కాకినాడ సముద్ర తీరంలో సిబ్బందికి సూచనలిస్తున్న మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి

ఫేక్ ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దు




పిఠాపురం చిన్నమాంబ పార్కులో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): అమ్మఒడి, చేయూత తదితర ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే ఫేక్ ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని, ఇటువంటి వాటిపై అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లోని చిన్నమాంబ పార్కులో శనివారం సాయంత్రం పార్కుకు వచ్చిన సందర్శకులకు, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అమరావతి నుంచి ప్రభుత్వ అధికారిని మాట్లాడుతున్నానంటూ ఫోన్‌కాల్స్ వస్తున్నాయని తెలిపారు. అపరిచితులు ఫోన్ చేసిన సమయంలో పంపే లింకులు ఓపెన్ చేయవద్దని... ఓటీపీలు, ఇతర సమాచారాన్ని షేర్ చేయవద్దని ఆయన సూచించారు. ప్రభుత్వ పథకాలపై తెలుసుకోవాలంటే సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాలు, ఆధార్, బ్యాంకు ఖాతా లింకేజీ, ఖాతా యాక్టివ్ ఉందో లేదో బ్యాంకుకు నేరుగా వెళ్లి తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఎస్ఐ మణికుమార్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఇటీవల ఫోన్ల ద్వారా ప్రజలకు డబ్బులు వస్తాయని నమ్మించే వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ సూచించారు. ఉప్పాడ మినీ హార్బర్‌లో మత్స్యకారులకు వాట్సాప్ స్క్రీన్ షేరింగ్ ద్వారా జరిగే మోసాల పట్ల అవగాహన కల్పించారు. ఎవరైనా అలా డబ్బులు పోగొట్టుకొన్నట్టయితే 1930కు ఫోన్ చేసి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

విశాఖపట్నం చరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు

కాకినాడ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల్లో ప్రముఖ రచయిత ర్యాలి ప్రసాద్ రచించిన విశాఖపట్నం చరిత్ర పుస్తక ఆవిష్కరణ సభను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆదిత్య యూనివర్శిటీ ఛాన్స్‌లర్, విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. శేషారెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం చరిత్ర ఒక పుస్తకమని నేటి సోషల్ మీడియా కాలంలో పుస్తకపఠనం చాలా తగ్గిందని యువత మన ప్రాంతం చరిత్రను తెలుసుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎన్.బుచ్చిరెడ్డి మాట్లాడుతూ చరిత్రకు సంబంధించిన రచనలు చేయడం రాబోయే తరాలకు చాలా అవసరమన్నారు. పారిశ్రామికవేత్త టి.మాచారెడ్డి మాట్లాడుతూ సమాజం చరిత్రను ఆసక్తిగా చదివే విధంగా రచయిత ఈ పుస్తకాన్ని రచించారన్నారు. రచయిత ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ గౌతమ బుద్ధుని కాలం నుంచి విశాఖపట్నం చారిత్రకంగా తన ప్రత్యేకతను చాటుకుంటూ వస్తుందన్నారు. అనంతరం రచయితను అతిథులు సత్కరించారు. సూర్య భాస్కర్, సత్యనారాయణ, రామరాజు, భాస్కరరెడ్డి, సాహిత్యాభిమానులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమష్టి కృషితోనే అభివృద్ధి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్



నర్సింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారులు

జీజీహెచ్(కాకినాడ) మే 10 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఆరోగ్య ప్రధాయిని అయిన కాకినాడ జీజీహెచ్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు వేగవంతంగా అందించేందుకు వైద్యులు, టెక్నికల్, నాన్ టెక్నికల్, నర్సింగ్ సిబ్బంది సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్‌లకు వైద్య సేవలందించడంలో కీలకమైన నర్సింగ్ సిబ్బంది సమస్యలపై దృష్టి సారించి వార్డుల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఒక వేదిక ఏర్పాటు చేసి ఆ వేదిక ద్వారా సమస్యలు తెలుసుకుని వారికి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. నర్సులు సమస్యలు పూర్తిగా పరిష్కారం చేయగలిగితే ఒత్తిడి లేని సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వి.వరప్రసాద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ సంధ్యరాణి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ ఫ్లోరెన్స్ హెచ్ఐ సువర్ణరాజు ఉన్నారు.

పాదగయకు పోటెత్తిన భక్తులు

శనిత్రయోదశి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

పిఠాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనిత్రయోదశి కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు రాక ప్రారంభమైంది. పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి శనీశ్వరుడికి పూజలు జరిపారు. అనంతరం శనీశ్వరుడికి తైలాభిషేకాలు, నవగ్రహాలకు జరిగిన విశేష పూజల్లో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

కాకినాడ 27వ డివిజన్‌లో 4 ఉప్పునీటి బోరింగులు

కాకినాడ సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): వేసవి నీటి ఎద్దడి దృష్ట్యా స్థానిక 27వ డివిజన్ ప్రజల వాడకం నీటి అవసరాల కోసం 4 ఉప్పునీటి బోరింగులను ఏర్పాటు చేశారు. డివిజన్ ఇన్‌చార్జి కోడూరి కుమారస్వామి నీటి ఎద్దడి సమస్యను సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు వివరించగా ఉప్పునీటి బోరింగ్‌లు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ బోరింగ్‌లను శనివారం ప్రారంభించిన ఇన్‌చార్జి కుమారస్వామి డివిజన్ ప్రజల తరుపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుంగ నూకాలమ్మ, తుమ్మల సతీష్, గుడాల దేవి, పట్నాల రాఘవమ్మ, త్రిపురశెట్టి లక్ష్మి, కోడూరి నీలిమ, బి.వర, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి వార్షికోత్సవం



అన్నసంతర్పణలో పాల్గొన్న మాజీ మంత్రి చిక్కాల

కరప, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్ సెంటర్‌లో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారి 37వ వార్షికోత్సవ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజారి కొంపెల్ల చక్రధర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఏకాహం జరిగింది. స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన అన్నసంతర్పణకు వేలాదిమంది ప్రసాదాన్ని స్వీకరించారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అన్నసంతర్పణలో భక్తులకు వడ్డించారు. కమిటీ సభ్యులను చిక్కాల అభినందించారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి'

సామర్లకోట, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులను చేర్పించడం ద్వారా బంగారు భవిష్యత్‌కు తోడ్పడాలని కోరుతూ ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. తమ స్కూల్ అంకిత భావంతో కూడిన ఉన్నత విద్యార్హతలు కలిగిన సిబ్బంది ఉన్నారని, పట్టణంలో అధిక ఉత్తీర్ణత శాతంతో పాటు మండలస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిందని ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకం, యూనిఫాం, ఉచిత నోటు పుస్తకాలు, తల్లికి వందనం, స్కౌట్ అండ్‌గైడ్స్ వంటి సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, కేవీవీ సత్యనారాయణ, ఏఎల్‌వీ కుమారి పాల్గొన్నారు.



కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సాయిరామకృష్ణ

సభ్యత్వ కిట్లు పంపిణీ

జగ్గంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సభ్యత్వాల కిట్లను కాండ్రేగుల గ్రామంలో పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ శనివారం క్రియాశీలక సభ్యులకు అందజేశారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా భావించి ప్రతీ కార్యకర్తకు రూ.5లక్షలు ప్రమాద బీమా కల్పిస్తున్నారన్నారు. ఈక్రియాశీలక సభ్యత్వ కిట్లను అన్ని గ్రామాలకు పంపించారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తుని రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): తునికి చెందిన ఇంజరపు సింహాచలం సారా తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడ్ని కోర్టులో హాజరుపర్చినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పట్టాభి చౌదరి తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పాముగండిలో వైద్యపరీక్షలు

• స్పందించిన వైద్యాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జ్వరంతో బాధపడుతున్న గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

దేవీపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాముగండిలో 'అంతు చిక్కని వ్యాధి' అనే శీర్షిక ఈనెల 5వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమవ్వడంతో వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం ఆ గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మూర్తుజ వల్లి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమవారం నుంచి వైద్య సిబ్బంది వచ్చి ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తారన్నారు. పీహెచ్ఎన్ రాఘవమ్మ, ఎంపీహెచ్ఈవో వెంకటేశ్వర్లు, హెచ్‌వీ లక్ష్మి, ఎంటీఎస్ రమణ దొర, హెల్త్ అసిస్టెంట్ బంగారయ్య, ఏఎన్ఎం చామంతి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పరామర్శ



పాముగండి మాజీ సర్పంచ్ భార్య వరలక్ష్మిని పరామర్శిస్తున్న దృశ్యం

దేవీపట్నం, మే 10(ఆంధ్రజ్యోతి): పాముగండి మాజీ సర్పంచ్ కోసు అచ్చిబాబు భార్య వరలక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు, నాయకులు ముచ్చు వీర వెంకట సత్యనారాయణ, రేటంగి రాంబాబు, మలుగుల శ్రీనావాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదవారికి అండగా జేకే ట్రస్ట్ : జమాల్‌ఖాన్



ఇంటి సామగ్రి అందజేస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకుడు జమాల్‌ఖాన్

కూనవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): పేదవారికి అండగా జేకే ట్రస్ట్ ఎప్పుడూ ఉంటుందని ఆ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ జమాల్ ఖాన్ అన్నారు. ఇటీవల ప్రకృతి వైపరీత్యాల కారణంగా కూనవరానికి చెందిన ఉమా దుర్గ, లావణ్యకు చెందిన ఇళ్లుకూలిపోవడంతో శనివారం వారికి ఆయన సిమెంట్ రేకులు, ఇనుప రాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుడు జమాల్ ఖాన్ మాట్లాడుతూ తనవంతుగా ప్రజలకు జేకే ట్రస్ట్ ద్వారా ఎప్పుడూ సహాయం చేస్తూ ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు, బరపాటి ప్రకాష్, చలకాని ఉమా, సుబీ, హెచ్ రాము, తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం ఎస్ఐగా ఎస్‌కే సాదిక్



మోతుగూడెం, మే 10 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం ఎస్ఐగా ఎస్‌కే సాదిక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మారేడుమిల్లిలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, సారా తరలింపుపై ప్రత్యేక దృష్టిపెడతానన్నారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఎస్ఐ కె. శివనారాయణ రైల్వేశాఖకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐను పోలీస్ సిబ్బంది అభినందించారు.

ఆటో బోల్తా... ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రులకు వైద్యచికిత్స అందిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి, మే 10 (ఆంధ్రజ్యోతి): శరభవరం గ్రామ శివారున శనివారం కొయ్యూరు గ్రామానికి చెం దిన ఓ వ్యక్తి ఆటోలో రాజమహేంద్రవరం వెళుతున్న సమయంలో కుక్కల గుంపు ఒక్కసారిగా జాతీయరహదారిపై పరుగులు పెడుతూ వచ్చాయి. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడగా ... డ్రైవర్ ప్రాణభయంతో పక్కకు దూకేశాడు. అదే సమయంలో శరభవరం గ్రామానికి చెందిన కాకర్లపూడి తిరుపతిరాజు, ఆయన మనుమడు హర్షిత్ వర్మ వారి ద్విచక్రవాహనంపై కాకరపాడువైపు వెళుతుండగా ఆ ఆటో ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయారు.

దీంతో వారిరువురికి తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యసిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం మైదాన ప్రాంతానికి తరలిస్తున్నట్టు తెలిపారు.

గ్రామ కమిటీలతోనే టీడీపీ బలోపేతం



గొందూరులో మాట్లాడుతున్న శ్రీనివాస్

దేవీపట్నం, మే 10(ఆంధ్రజ్యోతి): గ్రామ కమిటీలతోనే పార్టీ బలోపేతం అవుతుందని రంపచోడవరం నియోజకవర్గ అబ్జర్వర్ చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు. పూడిపల్లి పంచాయతీ గొందూరులో పార్టీ మండల కన్వీనర్ మరిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి గ్రామ కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లను నియమిస్తున్నామన్నారు. రెండురోజుల్లో ప్రక్రియ పూర్తవుతుందన్నారు. శనివారం పూడిపల్లి పంచాయతీ గొందూరుకి సంబంధించి గ్రామకమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు కార్యదర్శులను ఏకగ్రీకంగా ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో అడహక్ కమిటీ సభ్యులు మగపు బాబూరావు, తెల్లం గంగాధర్, ముంద్రు మధుసూదనరావు, కుంజం రాజమణి, ముచ్చు వీర వేంకట సత్యనారాయణ, రేలంగి రాంబాబు, జొన్నల రాంబాబు, కుంజం శివ, పోతుల వాసు, తదితరులు పాల్గొన్నారు.



కోటనందూరులో పల్లెవెలుగు బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య

అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు

ఎమ్మెల్యే యనమల దివ్య

కోటనందూరు, మే 10(ఆంధ్రజ్యోతి): తుని నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు నడపడానికి చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. శనివారం కోటనందూరులో ఎస్ఆర్‌పేటకు బస్‌సర్వీస్‌ను ఆమె ప్రారంభించారు. మండలంలో తాటిపాక సెంటర్ నుంచి ఎస్ఆర్ పేట, బీమవరపుకోట, జగన్నాధపురానికి బస్సు ఏర్పాటు చేయాలని ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఆర్టీసీ అధికారులు మాట్లాడారు. ఈనేపథ్యంలో శనివారం బస్సును సర్వీసును ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు, ఎస్.లోవరాజు, అంకంరెడ్డి రమేష్, పి.భాస్కరసత్యనారాయణ, తాండవ రిజర్వాయర్ వైస్ చైర్మన్ మేరపురెడ్డి జోగిబాబు, గొర్లి అచ్చియ్యనాయుడు, వెలగా వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

జగ్గంపేట రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం రోడ్డులోని కాపు కల్యాణ మండపంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచిత మెగా డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి రాష్ట్ర ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు సందర్శించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పేదలకు ఉచిత డీఎస్సీ కోచింగ్ అందించడం అభినందనీయమన్నారు. డీఎస్సీలో ఎక్కువ మంది ఉత్తీర్ణులై ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్‌ల కృషిని కొనియాడారు. ఫౌండేషన్ ద్వారా జ్యోతుల నవీన్ ఆడ బిడ్డలకు పెళ్లి కానుక పథకం పేదలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఎ.భాస్కరరావు,నీలం శ్రీను, అడపా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

పాదగయకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనిత్రయోదశి కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు రాక ప్రారంభమైంది. పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి శనీశ్వరుడికి పూజలు జరిపారు. అనంతరం శనీశ్వరుడికి తైలాభిషేకాలు, నవగ్రహాలకు జరిగిన విశేష పూజల్లో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



గణేష్ ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

ఆపరేషన్ సిందూర్ విజయంపై పూజలు

ఏలేశ్వరం, మే 10(ఆంధ్రజ్యోతి): త్రివిధ దళాలకు ధైర్యం కలగాలని, మరింత విజయం చేకూరాలని శనివారం మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ నేతృత్వంలో గణపతికి గరికలతో పూజలు చేశారు. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయంపై పట్టణంలో వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ కుమార్, మాజీ కౌన్సిలర్ కె.ప్రసాద్, కావలి శ్రీనివాస్, గోళ్ల విజయ్ కుమార్, ఉద్దగిరి సాయినాధ్, చందక శేషు తదితరులు పాల్గొన్నారు.

సోమాలమ్మ అమ్మవారి వార్షికోత్సవానికి శ్రీకారం

జగ్గంపేట, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సోమాలమ్మనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ సోమాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ 7వ వార్షికోత్సవానికి శనివారం సాయంత్రం ఆలయ కమిటీ సభ్యులు, భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, ముమ్మిడివరపు లలితబాబు ఆధ్వర్యంలో అమ్మవారి గరగల ఊరేగింపుతో అంకురార్పణ చేశారు. తొలుత టీడీపీ మండల అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ మారిశెట్టి భద్రం గరగను నెత్తిన పెట్టుకుని ఆలయ వార్షికోత్సవం, అమ్మవారి జాతర మహోత్సవానికి అంకురార్పణ చేశారు. ఈనెల16 వరకు సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు జరుగుతాయన్నారు. సోమవారం 4గంటల నుంచి అమ్మవారి జాతర ప్రారంభమవుతుందన్నారు. జాతరలో పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. 16వ తేదీన మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కొండ్రోతు శ్రీను, కోడూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళకు జీవనాధారం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం గండేపల్లిలోని మహిళా సమైక్య కార్యాలయంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ తరగతులను ఎమ్మెల్యే నెహ్రూ, ఏపీఐఎస్‌సీ చైర్మన్, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు ప్రారంభించారు. మండలంలో 158మంది మహిళలతో శిక్షణ ప్రారంభించామన్నారు. 90రోజులు శిక్షణ ఉంటుందని, అనంతరం ప్రభుత్వ సహకారంతో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కుట్టుమిషన్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, పరిమి మాము, ఏవో చంద్రరావు, వెలమాటి కాశి, బొల్లంరెడ్డి రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, తహశీల్దార్ శ్రీనివాస్, ఏపీఎం సన్యాసిరావు, తెలగరెడ్డి భద్రరావు, కాటేపల్లి వీరభద్రం, పాలచర్ల నాగేంద్ర చౌదరి, దార్లంక శ్రీనివాసు, పెనుమర్తి భాస్కర రావు, దార్లంక నూకరాజు, సేలామంతుల వీరబాబు, వెంపాటి రాజు, తెలగరెడ్డి ప్రకాష్, బలిరెడ్డి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణ సెంటర్ ప్రారంభం

జగ్గంపేట, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదరణ పథకం ద్వారా ఉచిత కుట్టుమిషన్ శిక్షణ (టైలరింగ్) సెంటర్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ శిక్షణ పొందిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం లేదా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామన్నారు. తొలుత పాకిస్తాన్, భారత్ యుద్ధంలో అశువులు బాసిన మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొంతసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గం ఇనాచర్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ తదితరులు పాల్గొన్నారు.



క్యాంప్ కమాండెంట్‌లతో ప్రతిభ కనబరిచిన శ్రీప్రకాష్ విద్యార్థులు

ఎన్‌సీసీ బాలికల శిక్షణ శిబిరంలో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

తుని రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): 3వ ఆంధ్రా ఎన్‌సీసీ బాలికల బెటాలియన్ వార్షిక శిక్షణా శిబిరంలో నిర్వహించిన పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సూరంపాలెంలో ఈనెల ఒకటో తేదీ నుంచి శనివారం జరిగిన 3వ ఆంధ్రా ఎన్‌సీసీ బాలికల బెటాలియన్ జూనియర్, సీనియర్ ఉమ్మడి వార్షిక శిక్షణ శిబిరం-1లో నిర్వహించిన వివిధ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యానికేతన్‌కు చెందిన జూనియర్ వింగ్ ఎన్‌సీసీ కాడెట్లు, శ్రీప్రకాష్ జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ క్యాడెట్లు ప్రతిభ ప్రదర్శించారు. ఈశిబిరానికి 8 జూనియర్, 5 సీనియర్ వింగ్‌లకు చెందిన మొత్తం 45మంది క్యాడెట్లు హాజరయ్యారు. శ్రీప్రకాష్ విద్యార్థులు జూనియర్ వింగ్ విభాగంలో సోలో సాంగ్‌లో ప్రథమస్థానం ఖోఖో, చెస్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి ఒక బంగారు పతకం, 10వెండి పతకాలను, సీనియర్ విభాగంలో బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం, గ్రూప్‌సాంగ్, ఖోఖోలో ద్వితీయ స్థానం సాధించి ఒక బంగారు పతకం, 13 వెండి పతకాలు సాధించారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ హెచ్ఎస్ మాలిక్, గ్రూప్ కమాండర్ రితిన్ మోహన్ అగర్వాల్, ఎస్ఎం గులాబ్‌సింగ్ నుంచి పతకాలను అందుకున్నారు. విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ తదితరులు అభినందించారు.

ఆదిత్యలో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



ఎన్‌సీసీ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

గండేపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో 3వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ హెచ్ఎస్ మాణిక్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి 1వ కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా 3వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్ఎస్ మాణిక్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు, క్రమ శిక్షణ, సామాజిక సేవ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి ఎన్‌సీసీ క్యాంప్ ఉపయోగపడుతుందన్నారు. ఆదిత్య యూనివర్శిటీ సూరంపాలెంలో ఈనెల1 నుంచి 10వరకు జరిగిన శిబిరంలో కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామ రాజు జిల్లాల నుంచి 550మంది ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు. ఈశిక్షణా శిబిరంలో డ్రిల్, మ్యాప్ రీడింగ్, ఆయుధ విడిభాగాలను జోడించడం, విడదీయం, ఫైరింగ్ వంటి వాటిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కాకినాడ హెచ్ క్యూ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, గ్రూప్ కమాండర్, క్యాంప్ కమాండెంట్ కల్నల్ హెచ్ఎస్ మాణిక్, ఆదిత్య యూనివర్శిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి సహకారం అందిస్తాం

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): తునిలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తుని పట్టణంలోని పాత గ్రంథాలయం వద్ద ప్రెస్‌క్లబ్‌కు కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. ఏపీయూడబ్ల్యూజే కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవవరపు కృష్ణార్జునరావు ఆధ్వర్యంలో పలువురు పాత్రికేయులు ఎమ్మెల్యే దివ్యను కలిసి భవన నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈఅంశాన్ని ప్రభుత్వం తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆమె వెంట టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, చింతమనీడి అబ్బాయి, యినిగంటి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ



ప్రత్తిపాడులో పోలీసులకు హెల్మెట్‌లు అందజేస్తున్న కూటమి నాయకులు

ప్రత్తిపాడు, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని పోలీసులు, వాహనచోదకులకు శనివారం వేగులమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు హెల్మెట్స్ పంపిణీ చేశారు. నాలుగు రోజులుగా వేగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శాంతియుతంగా నిర్వహించడంలో పోలీసుల సేవలు ప్రశంసనీయమని ఆలయ కమిటీ చైర్మన్ వెలుగుల నాని, కూటమి నాయకులు గోపిశెట్టి శ్రీను, అంబటి బుజ్జిలు కొనియాడారు. ఆలయ కమిటీ సమకూర్చిన హెల్మెట్లను పోలీసులకు, వాహనదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీకాంతం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షల చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కును పంపిణీ చేస్తున్న దృశ్యం

కోటనందూరు, మే 10(ఆంధ్రజ్యోతి): అల్లిపూడి గ్రామానికి చెందిన చింతకాయల రవి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును శనివారం ఎమ్మెల్యే యనమల దివ్య కోటనందూరులో తల్లి సత్యవతికి అందజేశారు. కార్యక్రమంలో రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు, పెంటకోట భాస్కరసత్యనారాయణ, వెలగా వెంకట కృష్ణారావు, అంకంరెడ్డి బుల్లిబాబు, చిటికెల సత్యనారాయణ, అంకంరెడ్డి రమేష్, చింతకాయల రవికుమార్, తహశీల్దార్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

ప్రత్తిపాడు, మే 10(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ ఎం.శివప్రసాద్ కోరారు. శరభవరం, గజ్జెనపూడి గ్రామాల్లో ఎక్సైజ్ సిబ్బంది శనివారం సారా నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ శివప్రసాద్ మాట్లాడుతూసారా నిర్మూలనకు ప్రజల సహకారం ఉండాలన్నారు. సారా తయారీ, రవాణాపై ప్రజలు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జ్ఞానేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.



కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేసేందుకు కూటమి ప్రభుత్వం మహిళా అభ్యుదయ పథకాలకు రూపకల్పన చేస్తోందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తుని పట్టణంలోని బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలని, ఇందు కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువజన సుందరి, వైస్ చైర్మన్ కుచ్చర్లపాటి రూపాదేవి, ఆచంట సురేష్, ఆరుగల నరసింహమూర్తి, దంతులూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సూట్‌కేసు అందజేత

అన్నవరం, మే 10(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌కు చెందిన ఒక ప్రయాణికురాలు విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వెళ్లేందుకు తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. విలువైన వస్తువులు ఉన్న సూట్‌కేస్‌ను మరిచిపోయి రాజమహేంద్రవరం స్టేషన్‌లో ఆమె దిగిపోయింది. దీంతో ఆమె అక్కడి రైల్వే పోలీసులకు ఫిర్యాదుచేసింది. తుని జీఆర్‌పీ ఎస్ఐకు సమాచారం రావడంతో ఆయన సూచనతో అన్నవరం హెచ్‌సీ శ్యామ్ తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న సూట్‌కేస్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు సూట్‌కేసును ఆమెకు అప్పగించారు. దానిలో విలువైన పట్టుచీరలు, పలు డాక్యుమెంట్లు ఉన్నట్లు ఆమె తెలిపింది. ఈసందర్భంగా శ్యామ్‌ను అభినందించారు.

అంగన్‌వాడీలో మాతృ దినోత్సవం

కిర్లంపూడి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తు మదర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీవో పూర్ణిమ మాట్లాడారు. పిల్లలకు తల్లి ఒక రోల్ మోడల్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు తల్లులు కాళ్లు కడిగి నమస్కారం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, బుసమ్మ, కరీ మున్నిష, అమ్మాజీ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

సర్పవరం జంక్షన్, మే 10 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంఘం కోశాధికారి శ్రీదేవి, సభ్యులు శాంతి, మాధవిలత, పద్మ, దీపిక, అడబాల రత్న ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.